క్లుప్తంగా

క్రీడాపోటీలు మానసిక వికాసానికి దోహదం


భీమవరంలో చెస్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: క్రీడాపోటీలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహద చేస్తాయని భీమవరం వన్ టౌన్ సీఐ అడబాల శ్రీను, టుటౌన్ సీఐ జె శ్రీనివాస్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరంలోని అనసూయ అకాడమీలో నిర్వహించిన అండర్-17 ఓపెన్ బాలురు, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా పిల్లల ఆసక్తి మేరకు తల్లిదండ్రులు వివిధ రంగాల్లో తర్ఫీదు ఇప్పించాలని సూచించారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఇక్కడి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు నలుగురు ఏప్రిల్ 20, 21 తేదీల్లో గుడివాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్ 17 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్, మాదాసు రవి పాల్గొన్నారు.

భీమవరంలో స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు


వైద్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జేసీ

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం ఏరియా ఆస్పత్రిలో జిల్లాలో ప్రథమంగా ఏర్పాటు చేయనున్న స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు కోసం గదులను డీసీహెచ్ పి.సూర్యనారాయణ, డా. వి.మాధవీకల్యాణితో కలిసి జిల్లా జాయింటు కలెక్టరు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ కొంతమంది నెలలు నిండని పుట్టిన పిల్లలకు, తల్లిపాలు సమృద్ధిగా లేని పిల్లలకు పాలును అందజేసేందుకు స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు ద్వారా మంచి అవకాశం కలుగుతుందన్నారు. స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు త్వరలో ఏర్పాటు చేసినట్లయితే కొంతమంది దాతలు తల్లుల నుంచి పాలును సేకరించి స్వచ్ఛ తల్లిపాలు నిధిలో భద్రపరిచి, అవసరం అయిన పుట్టిన బిడ్డలకు అందించి శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. మన ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ ఏరియా హాస్పిటల్‌లో మాత్రమే స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు ఉందని, ఇది రెండవది అని, మన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఏరియా హాస్పిటల్‌లో త్వరలో ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వలంటీర్ల రాజీనామాలు


యండగండిలో రాజీనామా చేస్తున్న వలంటీర్లు

ఉండి: ప్రజలకు మంచి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని నియమిస్తే ప్రజలకు చెడు చేసేవారు మమ్మల్ని వేధిస్తున్నారు. అందుకే రాజీనామా చేస్తున్నామంటూ యండగండికి చెందిన వలంటీర్‌లు పేర్కొన్నారు. యండగండి గ్రామానికి చెందిన 20 మంది వలంటీర్‌లు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయితీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కె.పవన్‌కుమార్‌కు తమ రాజీనామాలు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌లు మాట్లాడుతూ తాము వలంటీర్‌లు కాకముందు మాకు ఒకటే కుటుంబంగా ఉండేదని, కానీ వలంటీర్‌లుగా భాధ్యతలు చేపట్టిన తరువాత జగనన్న మాకు 50 కుటుంబాలను ఇచ్చారని అన్నారు.మేము అందించే సంక్షేమ పథకాల ద్వారా వారంతా మా కుటుంబ సభ్యులుగా మారిపోయారని అన్నారు. అందరికీ తాము సేవలందిస్తుంటే మమ్మల్ని తీసేవాయాలని నానా మాటలు మాట్లాడిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు తప్పకుండా తగిన బుద్ధి చెబుతామని అన్నారు.

ముగిసిన స్పెక్ట్రా ఉత్సవం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మండలం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా సాగుతున్న సాంకేతిక ఉత్సవం స్పెక్ట్రా 2కె24లో ముగింపు సందర్భంగా గురువారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో హుషారెక్కారు. సరదా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకత బయట పడుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అబ్బుర పర్చాయని, భవిష్యత్‌లో ఇవి స్టార్టప్‌లుగా మారాలని కోరుకుంటున్నామన్నారు. డిగ్రీ ఎలా పూర్తి చేశామన్నది ప్రధానం కాదు ,విద్యార్థులు ఏం నేర్చుకున్నారనేది జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు అభినందించారు.

ఆకివీడులో అభివృద్ధి జోరు

- ఆకివీడులో అభివృద్ధి జోరు
- రెండున్నర ఏళ్లలోనే రూ. 16.31 కోట్లతో 162 పనులు
- ఇప్పటికే రూ. 6.81 కోట్ల విలువైన 90 పనుల పూర్తి
- దశాబ్దాల కాలం నాటి సిద్ధాపురం రోడ్డు సమస్యకు పరిష్కారం
- రెండు పూటల తాగునీరు
- కాలనీల్లో విద్యుత్ వెతలకు చెక్


ఆకివీడు నగర పంచాయతీ ఏరియల్ వ్యూ


సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసిన సిద్ధాపురం రోడ్డు


శాంతి నగర్‌లో నిర్మించిన సీసీ డ్రెయిన్.


పార్కుగా అభివృద్ధి చేస్తున్న దొరగారి చెరువు

సాక్షి, భీమవరం/ఆకివీడు: జనరల్ ఫండ్ నిల్వ కేవలం రూ.1.4 లక్షలు ఉంటే రూ. మూడు కోట్లు పైనే విద్యుత్ బకాయిలు. ఎక్కడ చూసిన పారిశుద్ధ్య లేమితో దుర్గంధం వెదజల్లుతున్న వీధులు, పూడుకుపోయిన డ్రెయిన్లు, అధ్వానంగా ఉన్న రోడ్లు, తాగునీటి సమస్యలు. ఇది ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసేనాటికి ఆకివీడు నగర పంచాయతీ దుస్థితి. అయితే పాలన పగ్గాలు చేపట్టింది మొదలు ప్రభుత్వ తోడ్పాటు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సహకారంతో నగర పంచాయతీలో చైర్‌పర్సన్ జామి హైమావతి శ్రీనివాసరావు ప్రగతిని పట్టాలెక్కించారు. ఉండి నియోజకవర్గంలో అతి పెద్ద పంచాయతీ అయిన ఆకివీడు సుదీర్ఘకాలం పాటు టీడీపీ పాలకవర్గం ఏలుబడిలోనే ఉండడంతో సమస్యలతో ప్రజలు ఇబ్బందిపడేవారు.

అభివృద్ధి దిశగా అడుగులు

గ్రామ జనాభా, విస్తీర్ణం మేరకు 2020 జనవరి 28న ప్రభుత్వం నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసింది. 2021 నవంబరులో నగర పంచాయతీకి తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఆకివీడు ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. 20 వార్డులకుగాను 13 వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించారు. దీంతో కొత్త పాలకవరగం కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే పారిశుద్ధ్యం నిర్వహణ, విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ తదితర సదుపాయాల కల్పన కోసం వివిధ రకాల ప్రభుత్వ గ్రాంట్లు, జనరల్ ఫండ్స్ నిధులు రూ. 16.31 కోట్లు విలువైన 162 అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా నగర పంచాయతీని పట్టిపీడిస్తున్న పలు సమస్యలకు చెక్ పెట్టారు. ఇప్పటికే వీటిలో రూ. 6.81 కోట్లు విలువైన 90 పనులు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

గ్రామ జనాభా	32,412
విస్తీర్ణం	22.60 చదరపు కిలోమీటర్లు
వార్డులు	20
పట్టణంలో కుటుంబాలు	10,414

ఆర్థిక సమస్యలకు చెక్

నగర పంచాయతీ వార్షిక ఆదాయం రూ. 2.67 కోట్లు కాగా కొత్త పాలకవర్గం కొలువుదీరే నాటికి జనరల్ ఫండ్స్ కేవలం రూ. 1.4 లక్షలు మాత్రమే. పన్నుల్లోని లోపాలను గుర్తించి వాటిని సరిచేయడం ద్వారా ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 4.28 కోట్లకు చేరుకుంది. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు రూ. 2 కోట్లకుపైగా విద్యుత్ బకాయిలు చెల్లించినా జనరల్ ఫండ్స్ నిధులు రూ. 60 లక్షలు ఉండటం గమనార్హం.

వసతుల మెరుగు

పట్టణంలో 68 మంది పారిశుద్ధ్య కార్మికులుండగా గతంలో నాలుగైదు నెలలకోసారి జీతాలు ఇచ్చేవారు. కాగా ప్రస్తుత పాలకవర్గంలో వారికి ప్రతీనెల 3వ తేదీలోగా జీతాలు పడేలా చర్యలు తీసుకున్నారు. గతంలో వారానికి ఒకసారి మాత్రమే చెత్తసేకరిస్తే ప్రస్తుతం ప్రతిరోజూ ఇంటింట చెత్తసేకరణతో పాటు వారానికి మూడు సార్లు డ్రెయిన్లు శుభ్రం చేస్తున్నారు. గా రూ. 50 లక్షలతో పట్టణంలోని దొరగారి, భుజబలరాయుడు తదితర తాగునీటి చెరువుల ఫిల్టర్ బెడ్‌లకు మరమతులు చేయించి తాగునీటి సరఫరా మెరుగుపర్చి తాగునీటి సరఫరా మెరుగుపర్చారు. శ్రీనగర్ కాలనీకి రోజు విడిచి రోజు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేసే పరిస్థితి ఉండగా రూ. 12 లక్షలతో పైప్‌లైన్లు ఏర్పాటుచేసి నేడు వేసవిలోనూ రెండుపూటల నీరందిస్తున్నారు. చిన్నపల్లి వీధి, పెద్దపల్లివీధి, ఎస్సీ ఏరియా తదితర ప్రాంతాల్లో రూ. 30 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ల పనులు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. అలాగే పట్టణంలో 36 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 110 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం ద్వారా లో ఓల్టేజి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. నాలుగు దశాబ్దల కాలంగా పట్టణాన్ని పట్టిపీడిస్తున్న సిద్ధాపురం రోడ్డును రూ. 1.8 కోట్లు వెచ్చించి నిర్మించారు. రూ. 1.1 కోట్లు వ్యయంతో శాంతి నగర్ నుంచి మూలలంక బోది వరకు డ్రెయిన్ నిర్మాణం చేశారు. రూ. 70 లక్షలతో శ్రీనగర్ కాలనీలో డ్రెయిన్లు నిర్మాణం చేశారు. పట్టణంలో సీహెచ్‌సీ ఉండగా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో రూ. 1.2 కోట్లు వ్యయంతో సిద్ధాపురం రైల్వే గేట్ సమీపంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు.

ముంపు సమస్య తీరింది



ఆకివీడులో 20 ఏళ్లుగా ఉంటున్నాం. లోతట్టు ప్రాంతం కావడం, డ్రెయిన్లు, రోడ్లు లేక వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే ముంపు సమస్యతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఈ కౌన్సిల్ వచ్చాక రోడ్లు, డ్రెయిన్ నిర్మించారు.

– సాజిపల్లి పార్వతి, శాంతినగర్ కాలనీ

తాగునీటికి సమస్యలు తీరాయి



గతంలో తాగునీటికి చాలా ఎద్దడిగా ఉండేది. రెండు మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పైప్‌లైన్లు నిర్మించడంతో పాటు మా కాలనీలో విద్యుత్ సమస్యలు పరిష్కరించారు.

బి. ఆదిలక్ష్మి, శ్రీనగర్ కాలనీ

పీవీఎల్ సహకారంతోనే అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు అడుగడుగునా పట్టణాభివృద్ధికి ఎనలేని సహకారం అందిస్తున్నారు. ఎన్నో దీర్ఘకాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. అందరిని సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నాం.

– జామి హైమావతి శ్రీనివాసరావు, చైర్‌పర్సన్

అభివృద్ధిలో ఆదర్శవంతం



ఆకివీడును అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. అందుకు ప్రభుత్వ సహకారం సంపూర్ణంగా లభిస్తోంది. దీర్ఘ కాలం నాటి సిద్ధాపురం రోడ్డు సమస్యను పరిష్కరించాం. తాగునీటి సరఫరా మెరుగుపర్చాం. రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నాం. దొరగారి చెరువును కూడా అందమైన పార్కుగా అభివృద్ధి చేస్తున్నాం.

పీవీఎల్ నరసింహరాజు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఉండి

ఇఫ్తార్ విందులో పీవీఎల్


చిన్న మసీదు వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొన్న పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: మతసామరస్యానికి పెట్టింది పేరుగా ఉన్న ఉండి నియోజకవర్గంలోని అన్ని మతాల ప్రజలు అన్నదమ్ముల్లా జీవిస్తుండటం ఎంతో సంతోషంగా ఉంటుందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక ముస్లిం వీధిలోని చిన్న మసీదులో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులో శుక్రవారం పీవీఎల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ. బిలాల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పల పండు, విప్ పడాల శ్రీనివాస్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిరప్ శీనివాస్, ఎండీ జమీర్, సిద్ధిక్, జహంగీర్, తేజాద్, ఎండీ ఆలీ, ఎండీ జక్కీ, ఎస్కె ఆరీఫ్, బాజీ, హుస్సేన్, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, భీమవరం పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, మన్నే పోతరాజు, అన్యెం కృష్ణ, చిక్కాల చిన్నా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న గ్రంధి రవితేజ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న గ్రంధి రవితేజ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని పెద్ద మసీదులో శుక్రవారం రాత్రి ముస్లిం సోదరులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రబ్బాని, షేక్ అన్సారి, అఫ్జల్ పాషా, మజీద్ సాహెబ్, నజీర్ సాహెబ్, ఖాన్ భాయి, కరీముల్లా, తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదపుల్లేరులో పీవీఎల్ పర్యటన

ఉండి: మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో శనివారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి


భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్‌వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల దృశ్యం


పాలకోడేరు: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కె.క్రాంతిబాబు

భీమవరం: దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు కోరారు.శుక్రవారం భీమవరంలోని మండలి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని ఎంఎల్‌ఎఫ్, కెవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి మోషేనురాజు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎఫ్ నాయకుడు బోకూరి విజయ రాజు, కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

భీమవరం: రాజకీయ దురంధరుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. వెంకటరమణారావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎస్ఎం చక్రవర్తి, చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి సుబ్రమణ్యం, ఎస్‌కె చాన్‌భాషా పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ప్రభుత్వ రంగాన్ని, రిజర్వేషన్లు కాపాడుకుందాం అని వర్గీకరణ పేరుతో మోసం చేస్తూ ఓట్లు దండుకోవాలని చూసే బీజేపీని ఓడించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు పిలుపునిచ్చారు. దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి పాలకోడేరు గరువు పేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కె.మహంకాళి అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన క్రాంతిబాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, కె.నరేష్ పాల్గొన్నార. ఐదు దశాబ్దాలపాటు స్వాతంత్ర్య సమర యోధుడిగా, పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానిగా, రక్షణశాఖ మంత్రిగా దేశానికి, అణగారిని ప్రజలకు బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు అందించారని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. గొరగనమూడిలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాళ్లలో..

కాళ్ల: సంఘ సంస్కర్త, మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ సేవలు ఎనలేనివని వేంపాడు సర్పంచ్ ఇర్రింకి పద్మావతి, మాజీ సర్పంచ్ వీరమల్లు బోసు తెలిపారు.బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని వేంపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరమల్లు చిన్నగంగయ్య బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మెట్ల నిర్మాణానికి రూ.10 వేలు ఆర్థిక సయం చేస్తానని హామీ ఇచ్చారు. వరిగేటి రవి, మావుదూరి గంగరాజు, చేవేటి భూషణం పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో 66 మందికి సత్కారం


ఉగాది వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఈనెల 9వ తేదీన భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా 66 మందికి ఉగాది పురస్కారాలను అందజేస్తున్నామని నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. శుక్రవారం ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వ వైభవాలను సంప్రదాయాలను పండుగల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేసేలా ఈ ఉగాది వేడుకలను 39 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 9న ఉదయం 9.30 గంటల నుంచి భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, కవి పండిత కళాకారులకు సత్కారాలు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నామని అన్నారు. వడుపు గోపి, కాంతేటీ వెంకట రాజు, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉత్తమ ఉద్యోగులకు, స్వచ్ఛంధ సంస్థలకు, సంఘ సేవలకు సుమారు 66 మందికి ఉగాది పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ప్రముఖుల హాజరవుతున్నారని తెలిపారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం


ఆకివీడు: పీవీఎల్ నర్సింహరాజును గెలిపించమని ఓటర్లను అభ్యర్థిస్తున్న గోపాలకృష్ణంరాజు


ఉండి: చెరుకువాడలో మేము సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆకివీడు: మాదివాడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అలుపెరుగని సేవలందించామని, ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు వేసి ఘన విజయం చేకూర్చాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు సోదరుడు గోపాలకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. మండలంలోని సిద్ధాపురం, కాళింగగూడెం గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ఆయన కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకం అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, సర్పంచ్‌లు చిగురుపాటి చిట్టిబాబు, గురువెల్లి అన్నపూర్ణ, ఎస్.రామరాజు, ఉపసర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అన్యెం కృష్ణ, యువజన కమిటీ అధ్యక్షులు చిక్కాల రామాంజనేయులు(చిన్నా), జంపన సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మాదివాడలో..

ఆకివీడు: ఆపేదెవరు, మమ్మల్ని ఆపేది ఎవరూ అంటూ మేము సైతం జగన్ విజయానికి సైనికులవుతాంటూ వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని రాజీనామా చేసిన వలంటీర్లు శుక్రవారం మాదివాడలో ప్రచారానికి దిగారు. స్థానిక సచివాలయం-3లో బూత్ నెం. 131లో పలువురు ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. స్థానిక వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగు నేతృత్వంలో నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల విజయమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం చేశారు.

మంచి చేసిన వారికి మద్దతుగా ఉండాలి

ఉండి: ప్రజలకు మంచి చేసిన వారికి మద్దత్తుగా మనమంతా నిలుద్దామని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు(శివయ్య) అన్నారు. శుక్రవారం చెరుకువాడలో ఆయన ఆధ్వర్యంలో మేము సిద్ధంకార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు మనకు మంచి చేశారు? ఎవరు మన చెడు చేశారు? అని ప్రజలు తప్పకుండా ఆలోచించాలని అన్నారు. కలలో కూడా కనీవినీ ఎరుగని విధంగా లక్షలాది రూపాలు ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత,గుండాబత్తుల సతీష్,బొడ్డు నాగన్న, బిల్ మోరియా, మేరీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలకు మేలు


దిరుసుమర్రులో సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: గత 58 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు మేలు జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప, నాగిడి పాలెం గ్రామాల్లో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి 11 మంది వివిధ శాఖల ఉద్యోగులను నియమించి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్ పెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు రూ. 36 కోట్లతో అప్రోచ్‌ల నిర్మాణానికి మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందజేసేందుకు జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్‌లు ఏర్పాటు చేశామన్నారు. నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, తిరుమాని శ్రీనివాస్, నాగిడి నారాయణస్వామి, ఎంపీటీసీలు తేలి జోషఫ్ రవికుమార్, కేతా నాగమణి, రామాని నరసింహస్వామి, బొమ్మిడి బాబు రాజేంద్రప్రసాద్, వేటుకూరి రంగరాజు, ఒడుగు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.